క్లుప్తంగా

శ్వేతార్క ఆలయంలో గణనాథుడి కల్యాణం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడికి పండితులు వివాహ వేడుకలు జరిపించారు. వసంతోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు బుధవారం కల్యాణం నిర్వహించారు. వధూవరుల పక్షాన రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణశర్మ నిలిచి వివాహం జరిపించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, రమ దంపతులతో పాటు గంగుల రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు శర్మ, మణిదీప్, రవి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల ఆలయ వార్షికోత్సవం



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలో రాధాకృష్ణుల దేవాలయంలో 10వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి అయినవోలు సాయి కృష్ణశర్మ ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు అర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. శ్వేతార్క ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ భక్తులతో గణపతి హోమం చేయించారు. రాధాకృష్ణుల వేషధారణలతో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవిందర్ యాదవ్ – రమ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆంజనేయస్వామి మాలధారులతో పాటు భక్తులకు మహాన్న దానం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ఖిలా వరంగల్: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి ఆర్థికంగా నష్టపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. ఇటీవల సైబర్ నేరాలు నిత్యకృత్యంగా మారాయని, రోజూ ఏదో ఒక చోట సంఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయని తెలిపారు. కరీమాబాద్ బీరన్నకుంటలో పోలీస్ కళాజాతా బృందం, మిల్స్‌కాలనీ పోలీసుల ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, చట్టాలు, సైబర్ నేరాలపై బుధవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌స్పెక్టర్ మల్లయ్య హాజరై మాట్లాడారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై చిన్నతనంలో జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై మహిమూద్, పోలీస్ కళాజాతా బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్య తీసుకోవాలి

కాళోజీ సెంటర్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీస్‌లతో లాఠీచార్జీ చేయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) తీవ్రంగా ఖండిస్తోందని, ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుజన్ ప్రసాద్ రావు బుధవారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, జీఓ నం 61 ఉత్తర్వుల ప్రకారం చెల్లించకుండా నారాయణఖేడ్‌లో రూ.2,400మాత్రమే చెల్లించారని ఈ విషయపై అడిగినందుకు దాడి చేయించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

‘అప్పులు తెచ్చి అభివృద్ధి చేశా’

నడికూడ : గ్రామాభివృద్ధి కోసం గత ప్రభుత్వం అప్పగించిన అభివృద్ధి పనులను అప్పులు తెచ్చి పూర్తి చేశానని, ఇప్పటి వరకు ఆ బిల్లులు రాలేదని నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు వాపోయారు. తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతోందని, పెండింగ్ బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామం అభివృద్ధి పథంలో నడవాలనే ఉద్దేశంతో విపత్కర పరిస్థితుల్లో కూడా అభివృద్ధి పనులను నిలుపుదల చేయకుండా పూర్తి చేశామన్నారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధికి సంబంధించిన రూ.50 లక్షలు వరకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు.

బోడగుట్టలో సమస్యల తిష్ట

- ధ్వంసమైన అంతర్గత సీసీ రోడ్లు
- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
- అసంపూర్తిగా శ్మశాన వాటిక పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ధ్వంసమైన సీసీ రోడ్డు



పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



అభివృద్ధికి నోచుకోని శ్మశాన వాటిక

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్టలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఈ ప్రాంతం కాజీపేట, కడిపికొండ, దర్గా ప్రాంతాలకు మధ్యతో రైల్వే ట్రాక్‌ను ఆనుకొని ఉంది. ఇక్కడ సుమారు 2 వేలు జనాభా ఉంది. అంతర్గత సీసీ రోడ్లు ధ్వంసం కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

గత ప్రభుత్వం శ్మశానవాటిక పనులకు రూ.36 లక్షలు మంజూరు చేస్తే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులను ప్రారంభించలేదు. శ్మశానవాటికలో నీటి సాకర్యం లేకపోవడం, బోరు పనిచేయకపోవడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు తప్పడం లేదు. బయటి నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. బోడగుట్ట నుంచి దర్గా వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం అంసంపూర్తిగా ఉండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. బోడగుట్ట – దర్గా ప్రధాన రోడ్డు మార్గం పూర్తయితే సమీప గ్రామాల ప్రజలు కాజీపేట మీదుగా కాకుండా దర్గా రోడ్డు మార్గం నుంచి వయా భట్టుపల్లి, లేదా ఫాతిమానగర్ మీదుగా తక్కువ సమయంలో హనుమకొండ, వరంగల్‌కు వెళ్లవచ్చు. కడిపికొండ నుంచి నాగులమ్మ చెరువు కట్ట మీదుగా వెళ్లే మార్గంలో నాగులమ్మ గుడి వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభం ఒక పక్కకు వంగి ప్రమాదకరంగా మారింది. బోడగుట్ట అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద కూడా మరో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. బోడగుట్ట ప్రజల చిరకాల వాంఛ అయిన కాజీపేట – బోడగుట్ట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలింది. ఎన్నికల వేళ హామీలు ఇచ్చి ఆ తర్వాత ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోడగుట్ట ప్రాంతంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయి. అసంపూర్తిగా శ్మశాన వాటిక పనులు, ధ్వంసమైన అంతర్గత సీసీ రోడ్లు, అధ్వానంగా ఉన్న దర్గా రోడ్డు నిర్మాణం, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల సమస్యలను పరిష్కరించారు. స్థానికుల చిరకాల వాంఛ అయిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. అందుకు పాలకులు, అధికారులు వెంటనే చొరవ తీసుకోవాలి.

– ఎండీ.చాంద్‌పాషా, స్థానికుడు

అధ్వానంగా కడిపికొండ బ్రిడ్జి

కడిపికొండ బ్రిడ్జి



వంతెనపై ఏర్పడిన గుంతలు



- కడిపికొండ టు ఖమ్మం బైపాస్ రోడ్డుపై అడుగడుగున గుంతలు
- భారీ వాహనాల రాకపోకలు
- నిత్యకృత్యంగా రోడ్డు ప్రమాదాలు



కాజీపేట అర్బన్: జాతీయ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కడిపికొండ బ్రిడ్జి అధ్వానంగా తయారైంది. కాజీపేట మండలంలోని కడిపికొండ గ్రామం నుంచి ఖమ్మం బైపాస్ రోడ్డుగా ఉపయోగించే కడిపికొండ బ్రిడ్జిపై నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దాంతో అడుగడుగునా గుంతలు ఏర్పడి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

జంకుతున్న ప్రయాణికులు

కడిపికొండ బ్రిడ్జి మీదగా నుంచి వేలాది వాహనదారులు ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. కడిపికొండలోని కేంద్రీయ విద్యాలయం, మైనార్టీ గురుకుల పాఠశాలతో పాటు ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలకు ఈ మార్గం ద్వారానే వెళ్తుంటారు. బ్రిడ్జిపై గుంతల కారణగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాంతో ఆ రహదాపై నుంచి వెళ్లేందుకు వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు.

గుంతలను తప్పించబోయి ప్రమాదాలు

కడిపికొండ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను తప్పించబోయి భారీ వాహనదారులు నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇటీవల గుంతను తప్పించబోయి కడిపికొండకు చెందిన ద్విచక్ర వాహనదారుడిని ఓ డీసీఎం డ్రైవర్ ఢీ కొట్టాడు. అదే దారిలో వెళ్తున్న టిప్పర్ సైతం ఢీ కొట్టడంతో ఆ వాహనదారుడు దుర్మరణం చెందాడు. ఇలా నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటునే ఉన్నాయి.

తాత్కాలిక మరమ్మతులు

కడిపికొండ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలకు అధికారులు రెడీమిక్స్ వేయించి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. భారీ వాహనాల కారణంగా అనతికాలంలో తిరిగి గుంతలు ఏర్పడుతున్నాయి. దాంతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రైల్వే సంఘ్ డిప్యూటీ సెక్రటరీగా మురళి



మురళిని సన్మానిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేటకు చెందిన రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకుడు చింత మురళికి సికింద్రాబాద్ డివిజన్ కమిటీలో కీలక పదవి లభించిందని రైల్వే సంఘ్ నాయకులు బుధవారం తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన సంఘ్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మురళికి ఈ అవకాశాన్ని డివిజన్ నాయకులు కల్పించారు. కాజీపేట మెయిల్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్‌గా పనిచేస్తూ సంఘ్ సీడబ్ల్యూసీ సభ్యుడిగా ఉన్న చింత మురళిని సికింద్రాబాద్ డిప్యూటీ డివిజన్ సెక్రటరీగా నియమించినట్లు వివరించారు. ఈ మేరకు రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయంలో ఆయనను బుధవారం రాత్రి రైల్వే సంఘ్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే సంఘ్ నాయకులు సాధినేని వెంకటనారాయణ, కె.రవి, పాక రాజ్‌కుమార్, నర్సింగరావు, బల్విందర్ సింగ్, బి.మాధవరావు, జగదీశ్వర్, మధుసూదన్‌రావు, అభిలాష్, కాంగ్రెస్ నాయకుడు ఎం.డి.అంకూస్ పాల్గొన్నారు.

కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు టీఎన్జీవోస్ నాయకుల అభినందన



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ నేతృత్వంలో జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగిన సందర్భంగా సిక్తా పట్నాయక్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు భరత్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి



నివాళులర్పిస్తున్న నాయకులు, స్థానికులు

కాజీపేట అర్బన్: కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం నాయకుడు జంపాల మురళి అన్నారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని కందుల బండ ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మురళి మాట్లాడుతూ సుందరయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకుని పోరాటాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జాటోతు విజయ్, సాంబయ్య, రమేష్, మదన్, సురేష్, రాజేశ్వరి, కోమల, కల్పన, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో మెగా రక్తదాన శిబిరం



ప్రశంస పత్రాలు అందజేస్తున్న ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వాగ్బాట యోగా అండ్ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల మధుసూదన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ హనుకొండ నేతృత్వంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పెసరు నిరంజన్ రెడ్డి హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. రక్తదాతల నుంచి 56 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది సేకరించారు. కార్యక్రమంలో వాగ్బాట, వాకర్స్ ప్రతినిధులు రాంచందర్, శ్రీశైలం, సాంబయ్య, సుభాష్, నవీన్‌రెడ్డి, రాంబాబు, కన్నయ్య, మోహన్, గోపాల్, వేణు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు అవగాహన కల్పించాలి



కాజీపేట: చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఎదురించేలా వారికి అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో సఖి వన్‌స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మహిళా అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం ప్రివెన్సన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్ గురించి వివరించారు. ఈ చట్టాన్ని బాధితులు వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో వినీల, స్వర్ణలత, సునీత దేవి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పిల్లలతో యోగాసనాలు వేయిస్తున్న అశోక్ ఆర్య

ఖిలా వరంగల్: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా గురువు అశోక్ ఆర్య అన్నారు. బాల సంస్కార్ –2024 కార్యక్రమంలో భాగంగా వరంగల్ శంభునిపేటలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో యోగా, భారతీయ కళలు, ఆచారాలపై బుధవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై బాలలకు యోగా ఆసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా అశోక్ ఆర్య మాట్లాడుతూ సేవా సమితి ఏర్పాటు చేసిన యోగా శిక్షణను బాలబాలికల సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యోగాతో ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో దయాకర్, శ్రీరామ్, శరత్‌బాబు, రవిబాబు, వెంకటరమణ, రమేష్, ఉదయ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

నీరు చల్లగా.. కూర రుచిగా..



కాజీపేట: వేసవి కాలంలో ఎండలు మండుతుండటంతో మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. వాటితో పాటు ప్రస్తుతం వివిధ ఆకృతుల్లో వచ్చిన మట్టి పాత్రలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గుజరాత్ రాష్ట్రంలో తయారు చేసిన కుండలను కాజీపేట పట్టణంలో విక్రయిస్తున్నారు. మట్టి పాత్రల్లో చేసిన వంట రుచికరంగా ఉంటుందని, ఆరోగ్యకరమని నిపుణులు సూచిస్తుండటంతో వాటి కొనుగోలుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ఫ్రిజ్‌లలో పెట్టే నీరు చల్లగా ఉన్నా అనారోగ్య సమస్యలకు కారణమవుతుందనే భావనతో ఇటీవలి కాలంలో చాలా మంది మట్టి కుండల వాడకం వైపు మొగ్గుచూపుతున్నారు. వాటి ఖరీదు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండటంతో కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. మట్టి కుండలు ఇలా మార్కెట్‌కు వస్తాయో లేదో అలా అమ్ముడుపోతున్నట్లు కాజీపేటకు చెందిన చిరు వ్యాపారి మర్రిపెల్లి సుజాత తెలిపారు.

పుస్తకాలు వస్తున్నాయ్..



గోడౌన్‌లోకి పుస్తకాలను దిగుమతి చేస్తున్న సిబ్బంది

విద్యార్థుల వివరాలు..	
1వ తరగతి	3,282
2వ తరగతి	3,067
3వ తరగతి	3,358
4వ తరగతి	2,076
5వ తరగతి	4,314
6వ తరగతి	5,179
7వ తరగతి	5,429
8వ తరగతి	5,674
9వ తరగతి	5,364
10వ తరగతి	5,422
కేజీబీవీ, మోడల్, గురుకులం	700
మొత్తం	43,865

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ
- వరంగల్ జిల్లాకు కావాల్సిన పుస్తకాలు 3,50,163
- ప్రస్తుతం వచ్చినవి 1,04,120

కాళోజీ సెంటర్: సర్కారు బడిలో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటుకు దీటుగా వసతులను కల్పించడంతోపాటు నాణ్యమైన, గుణాత్మక విద్య అందించేందుకు చర్యలు చేపట్టింది. పాఠశాల పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు అందించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు వరంగల్ జిల్లాలోని 757పాఠశాలల్లో 43,865 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. జిల్లాలోని విద్యార్థులకు 3,50,163 పాఠ్యపుస్తకాలు అవసరం ఉందని అధికారులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. బుధవారం నాటికి 1,04,120 పుస్తకాలు చేరుకున్నాయి. మొత్తం టైటిల్స్‌లో జిల్లాకు 187టైటిల్స్ కేటాయించగా.. ఇప్పటి వరకు 65టైటిల్స్ చేరుకోగా 122 టైటిల్స్ ఇంకా రావాల్సి ఉంది. రోజువారీగా పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో పాఠశాలల వివరాలు..	
ప్రాథమిక పాఠశాలలు	489
ప్రాథమికోన్నత పాఠశాలలు	87
హైస్కూళ్లు	181
మొత్తం	757

పాఠశాల మొదటి రోజే పంపిణీ



కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థుల చేతుల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు ఉండేలా చూస్తాం. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఈ సంవత్సరం టెన్త్ ఫలితాలు సాధించాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలి.

– వాసంతి, వరంగల్ డీఈఓ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్ మహానగరం పరిధిలో ఈనెల 16న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండలోని నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, బాలసముద్రం, గుండ్ల సింగారం, సుందరయ్యనగర్, గుంటూరుపల్లి, ముచ్చర్ల క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, నయీంనగర్, లష్కర్ బజార్, రాజాజీ నగర్, పోలీస్ హెడ్ క్వార్టర్స్ వెనుక వైపు, న్యూ బస్టాండ్ రోడ్డు, పద్మాక్షి దేవాలయం రోడ్డు, సిటిజన్ క్లబ్, భద్రకాళి బండ్, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ, గోపాల్‌పూర్, కల్లు మండువా, ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, బృందావన్ కాలనీ, కృష్ణాకాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కాజీపేట ఫాతిమా నగర్, దర్గా, బాపూజీ నగర్, వెస్ట్‌సిటీ, బాలాజీనగర్, ఇంపీరియల్ కాలనీ, కాజీపేట మెయిన్ రోడ్డు, బెల్ట్‌కాడర్ కాలనీ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ప్రశాంత్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్, బాబు క్యాంపు, ఫాతిమా జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, నగర శివారు ప్రాంతాలైన రాంపేట, తరాలపల్లి, మడికొండ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. అలాగే, వరంగల్‌లోని దేశాయిపేట సబ్‌స్టేషన్ పరిధిలోని దేశాయిపేట, బాలాజీనగర్, ఎంహెచ్‌నగర్, నక్రత్‌పుర, ఆరెపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప టెంపుల్, వ్యవసాయ కళాశాల, పోచమ్మ మైదాన్ పరిధిలోని శాంతినగర్, సెకండ్ బ్యాంక్ కాలనీ, గాయత్రి కాలనీ, మార్కండేయ దేవాలయం, 80 ఫీట్ల రోడ్డు, భారతి డిగ్రీ కళాశాల ఏరియా, గొర్రెకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని కీర్తినగర్, గరీబ్‌నగర్, గొర్రెకుంట, ఖిలా వరంగల్ సబ్‌స్టేషన్ పరిధిలోని తూర్పు కోట, పడమర కోట, మధ్య కోట, ఆదర్శనగర్, చింతల్, పుప్పాలగుట్ట ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని వరంగల్ డీఈఈ శంకేశి మల్లికార్జున్ తెలిపారు. శంభునిపేట, రంగశాయిపేట, తెలంగాణ కాలనీ, సాయినగర్ కాలనీ, రామాలయం ప్రాంతం, నాగమయ్య టెంపుల్, ఫోర్ట్‌రోడ్డు పెట్రోల్ పంపు ఏరియా, అన్నపూర్ణ కాంప్లెక్స్, సాయిబాబా టెంపుల్ లేన్, పద్మశాలి స్ట్రీట్, విశ్వనాథ కాలనీ, టీచర్స్ కాలనీ, గణేష్ నగర్ కాలనీ, మై మాస్టర్ లేన్, గిరిప్రసాద్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి 11గంటల విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. సెంట్రల్ పబ్లిక్ ఫీడర్, 11కేవీ మహంకాళి ఫీడర్, 33కేవీ ఎస్ఎస్ శంభునిపేట ఫీడర్ల పరిధిలోని విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన పీఆర్‌సీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

హన్మకొండ: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నూతన వేతన సవరణను అమలు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023, జూలై 1 నుంచి నూతన పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం చెల్లించాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఆర్ఎస్ కమిటీ రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించడం సంతోషకరమన్నారు. ఇది చర్చల వరకే పరిమితం కాకుండా త్వరగా ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. పీఆర్టీయూ జయశంకర్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ మాట్లాడుతూ ఈ వేసవిలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి, ఇది ఉద్యోగుల ప్రభుత్వం అని రుజువు చేసుకోవాలని అన్నారు. పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పున్నంచందర్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వల్లబోజు సుధాకర్, రాష్ట్ర నాయకుడు బోడ రాంజీ పాల్గొన్నారు.

బెదిరించిన కేసులో విచారణ

ఖిలా వరంగల్: అర్ధరాత్రి రోడ్డుపై కారు పార్కు చేసి అటువైపుగా వెళ్తున్న ఓ జర్నలిస్టును యువత బెదిరింపులకు పాల్పడిన కేసులో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. కారుపై కార్పొరేటర్ లెబుల్ స్టిక్కర్ వేసి పోలీస్ హారన్ మోతతో అర్ధరాత్రి అంతర్గత కాలనీల్లో తిష్టవేసి హల్‌చల్ చేసిన నలుగురు యువకులను మంగళవారం గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వారిని వాకి తల్లిదండ్రుల సమక్షంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. అంతముందు మామునూరు గ్రామంలో కార్పొరేటర్ ఇంటి ముంగిట్లో పార్కు చేసి కనిపించిన కారును మిల్స్‌కాలనీ స్టేషన్‌కు తరలించి ఆ కారుపై గతంలో ఏమైన కేసులు ఉన్నాయా..? ఉంటే వాటి వివరాలు ఏంటి.. ఆ కారు ఎవరిది అనే కోణంలో విచారణ చేసి వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం.